
# ప్రజా మారుతి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 207 పేజీలు : 04 వెల రూ. 2 బుధవారం 04 - 02 - 2026

అమెరికా భారత ఉత్పత్తులపై పన్ను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు

## హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ అన్న కిషన్ రెడ్డి
- ఉచిత పథకాల కోసమే బడ్జెట్ అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందన్న కిషన్ రెడ్డి
- సైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుంది



హైదరాబాద్ : హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026-27 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు.వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని - మిగతా 2 లో

## మేడారం జాతర విజయవంతం




- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం
- మేడారం జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ప్రశంసించారు
- క్లాస్, మాస్‌తోపాటు ఉన్నతస్థాయి వర్గాల వారూ ఈ జాతరకు భారీగా తరలివచ్చారు
- సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు




## మున్సిపల్ ఎన్నికల రెబల్స్‌కు జగ్గారెడ్డి గట్టి హెచ్చరిక

సంగారెడ్డి, సదాశివపేటలలో రెబల్స్ బెడద

పార్టీ నిర్ణయాన్ని కాదని బరిలో నిలిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరిక

సంగారెడ్డిలో ఎనిమిది వార్డుల్లో రెబల్స్ పోరు

## భారత రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

- ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం
- ఎస్ఎఫ్‌డీఆర్ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో
- ఒడిశాలోని చాందీపూర్ తీరంలో జరిగిన ప్రయోగం
- సుదూర గగనతల క్షిపణుల అభివృద్ధికి మార్గం సుగమం
- ఈ టెక్నాలజీతో భారత్‌కు పెరగనున్న వ్యూహాత్మక బలం





## అమెరికాతో వాణిజ్య ఒప్పందం వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం క్లారిటీ



- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- సహనమే గెలిపించింది
- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ఎన్‌డీఏ సమావేశంలో మాట్లాడిన ప్రధాని మోదీ
- రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ లేదన్న కేంద్ర ప్రభుత్వం
- అమెరికా వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు ససేమిరా
- వెనెజువెలా చమురు కొనుగోలు చేస్తామన్న కేంద్రం
- ఒప్పందం కుదరడంతో ప్రధాని మోదీని సంత్కరించిన కేంద్రమంత్రులు, ఎంపీలు

ఢిల్లీ : అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో, రైతుల ప్రయోజనం అంశంపై భారత ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం జరిగిందని, అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ పోస్టు నేపథ్యంలో విపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్రం స్పందించింది.అమెరికా మన దేశానికి ఎగుమతి చేసే వ్యవసాయ, - మిగతా 2 లో

## ప్రజానాడి




## నెయ్యి కల్తీపై ఏపీ కేబినెట్ సీరియస్

- శ్రీవారి నెయ్యి కల్తీపై కేబినెట్ సుదీర్ఘ సమీక్ష
- సీబీఐ నివేదికలోని అంశాలపై మూడున్నర గంటల చర్చ
- గత ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు జరిగాయన్న మంత్రులు
- దోషులపై చర్యలకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యమని స్పష్టం చేసిన ప్రభుత్వం



అమరావతి : కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ తీవ్రంగా స్పందించింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇతర అజెండా అంశాలను పక్కనపెట్టి, కేవలం ఈ అంశంపైనే సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చించింది. కోట్లాది మంది హిందువుల మనోభావాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని, తిరుమల పవిత్రతను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని కేబినెట్ అభిప్రాయపడింది. సీబీఐ సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు కొలుసు పార్థసారథి, పయ్యావుల కేశవ్, - మిగతా 2 లో

## విచారణ కమిషన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయం
- సిట్ నివేదిక, ఛార్జ్‌షీట్‌లో తేడాలు ఉన్నట్లు గుర్తింపు
- అసలు వాస్తవాలు తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిటీ
- మూడున్నర గంటల పాటు మంత్రివర్గ సమావేశం
- సిట్ సమర్పించిన నివేదికలో పాత్రధారులపై మాత్రమే సిఫార్సు చేసిందన్న మంత్రివర్గం
- అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం



అమరావతి : తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంపై అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిటీ వేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గంలో సిట్ నివేదికపై చర్చ కొనసాగింది. అన్ని అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై చర్చించారు. లడ్డూ కల్తీ జరిగిన విధానం, వివిధ విభాగాల తప్పిదాలను వివరిస్తూ నివేదిక ఉంది. ఇందులో ప్రభుత్వానికి సిట్ సమర్పించిన నివేదికలో పాత్రధారులపై మాత్రమే సిఫార్సు చేసిందని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది.అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. విచారణ అంశాలకు, ఛార్జ్ షీట్‌లో ఉన్న - మిగతా 2 లో

## ఢిల్లీలో నారా లోకేశ్

- నేడు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు
- రాష్ట్ర అభివృద్ధి, నిధుల సమీకరణే ప్రధాన అజెండా
- అమరావతి, విభజన హామీలపై చర్చించే అవకాశం
- ఐటీ, విద్యా రంగాల విస్తరణపై ప్రత్యేక దృష్టి



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ఎంపీలు విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి పనులపై చర్చించేందుకు, నిధులు రాబట్టేందుకు ఆయన కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం కానున్నారు.ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న లోకేశ్, బుధవారం పార్లమెంట్ భవనంలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక భేటీలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు, విద్యారంగ సంస్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు ఏపీ విభజన చట్టంలోని హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నారు.ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల మంత్రులతో లోకేశ్ చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రూ.92,649 కోట్ల పనుల వివరాలను - మిగతా 2 లో

# సంపాదకీయం

## దేశంలో విద్వేష విషం పెరుగుతోంది!



అమెరికాలోని వాషింగ్టన్ కేంద్రంగా నడుస్తున్న 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఆర్గనైజ్డ్ హేట్' అనే ఎన్జీవో సంస్థ భారతదేశంలో 2025 సంవత్సరంలో రాజకీయ నాయకులు చేసిన విద్వేష ప్రసంగాలపై అధ్యయనం చేసింది. 'ఇండియా హేట్ ల్యాబ్' పేరుతో తన నివేదికను ఇటీవలే విడుదల చేసింది. దీని ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 1,318 విద్వేష ప్రసంగాలు నమోదయ్యాయి. ఇందులో 1,164 ప్రసంగాలు బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే నమోదయ్యాయిం. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఢిల్లీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో ఎక్కువగా నమోదయ్యాయి. ఇందులో 1,289 ప్రసంగాలు ముస్లింలను టార్గెట్ చేస్తూ, వందకు పైగా ప్రసంగాలు క్రిస్టియన్లను టార్గెట్ చేస్తూ ఇచ్చినవి. మొత్తం ప్రసంగాలలో 98శాతం ముస్లింలకు, 2శాతం క్రిస్టియన్లకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ సంస్థ విడుదల చేసిన గత మూడేళ్ళ గణాంకాలను గమనిస్తే ప్రతి ఏటా విద్వేష ప్రసంగాల సంఖ్య రెట్టింపు అవుతూనే ఉన్నదని అర్థమవుతుంది. బీజేపీ నాయకులు వారి పార్టీ ర్యాలీలలో, మతపరమైన ఊరేగింపులలో, సాంస్కృతిక ర్యాలీలలో ఈ విద్వేష ప్రసంగాలు చేస్తున్నారు. తర్వాత, ఈ ప్రసంగాలను సోషల్ మీడియాలో బీజేపీ విస్తృతంగా ప్రచారం చేయిస్తోంది. ర్యాలీలలో పాల్గొన్న, సోషల్ మీడియాలో ఈ వీడియోలు చూసిన పేద, మధ్యతరగతి హిందువుల పిల్లలు మతపరమైన భావోద్వేగాలకు లోనవుతున్నారు. హద్దుమీరి మైనార్టీ ప్రార్థనా మందిరాలపైన, వ్యక్తులపైన దాడులు చేస్తూ, కేసులూ జైళ్ళ పాలై, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ విష వలయాన్ని పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి.ఎన్నికల సమయంలో ఈ విద్వేష ప్రసంగాలు తీవ్రస్థాయికి చేరుతున్నాయి. గత 12 ఏళ్లుగా బీజేపీ ప్రతి ఎన్నికను ప్రజా సమస్యలకు కేంద్రంగా కాకుండా, విభజన రాజకీయాలకు కేంద్రంగా మార్చుతూ వచ్చింది. ఓటర్లు భావోద్వేగంతో ఓటు వేసే పరిస్థితులను సృష్టించింది. ఇదే పద్ధతి కొనసాగితే దేశ ప్రజల భవిష్యత్తు అంధకారమే!విద్వేష ప్రసంగాలు చేసేవారిని శిక్షించడానికి ఇప్పటికీ ఒక ప్రత్యేక చట్టం లేదు. ఈ చట్టం రూపకల్పనకు సుప్రీంకోర్టు చొరవ చూపాలి. కేంద్ర ప్రభుత్వం గైడ్‌లైన్స్ రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలి. లేకపోతే ఈ విద్వేష పాలకుల విష ప్రసంగాలు ఆగవు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశకత్వంలో ఇటీవలే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా ఒక బిల్లును రూపొందించి అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. త్వరలోనే అది చట్టంగా మారే అవకాశం ఉంది. ఇదే స్ఫూర్తితో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ చట్టాన్ని రాష్ట్రంలో కూడా తీసుకొస్తామని ప్రకటించారు. దీనికి రాష్ట్రంలోని బీజేపీయేతర పార్టీలన్నీ మద్దతు తెలపాల్సిన అవసరం ఉంది. విద్వేష ప్రసంగాలకు తెలంగాణ కేంద్రంగా మారకుండా చూసుకోవలసిన బాధ్యత ఉద్యమకారులుగా మనందరి మీదా ఉంది.ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ప్రజల చైతన్యమే ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేస్తుంది. ఈ విద్వేష ప్రసంగాలు చేసే నాయకులను, విభజన రాజకీయాలను ప్రోత్సహించే రాజకీయ పార్టీలను వ్యతిరేకించాలి. ప్రజలలో ఈ స్థాయి చైతన్యానికి పౌర సమాజం, విద్యార్థి, యువజన సంఘాలు కృషి చేయాలి.

## ఢిల్లీలో చేరుకున్న నారా లోకేశ్

**మొదటిపేజీ తరువాయి** – కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై హై–స్పీడ్ రైల్వే కారిడార్ల అంశంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. కీలక సమావేశాల అనంతరం బుధవారం రాత్రికి ఆయన తిరిగి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం
## వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం క్లారిటీ

**మొదటిపేజీ తరువాయి** – పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు మొదటి నుంచి అంగీకరించడం లేదని స్పష్టం చేసింది. వాణిజ్య ఒప్పందం నేపథ్యంలోనూ అదే విషయాన్ని స్పష్టం చేశామని పేర్కొంది. వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలనలో ఉందని తెలిపింది. ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు మనం వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేయలేదని, ఇప్పుడు వాటిని ఎత్తివేశారని పేర్కొన్నారు. చమురు కొనుగోలు చేస్తామన్నారు.అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు చాలా తక్కువకు వస్తాయి. వాటిపై సుంకాలు తగ్గిస్తే మన దేశంలో రైతులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇంతకాలం వాణిజ్య చర్చల ప్రతిష్ఠంభనకు ఇది ప్రధాన కారణం. మన రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి వాణిజ్యం ఒప్పందం కోసం కేంద్రం ఆసక్తి చూపలేదు. ఇప్పుడు వాణిజ్య ఒప్పందం కుదరడంతో వస్తున్న విమర్శలకు కేంద్రం స్పష్టతనిచ్చింది.

## హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

**మొదటిపేజీ తరువాయి** – నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు.నైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు.

## మున్సిపల్ ఎన్నికల రెబల్స్‌కు జగ్గారెడ్డి గట్టి హెచ్చరిక



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలకు కూడా రెబల్స్ బెడద తప్పడం లేదు. ఈ క్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ అభ్యర్థులకు హెచ్చరిక జారీ చేశారు. తనను, పార్టీ నిర్ణయాన్ని కాదని ఎవరైనా నామినేషన్ వేస్తే వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.సంగారెడ్డి మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఎనిమిది వార్డుల్లో రెబల్స్ పోరు ఉంది. అయితే పార్టీ అధిష్ఠానం ఇప్పటికే అభ్యర్థులకు బీ–ఫామ్‌లు అందజేసింది. పోటీకి ఆసక్తి చూపుతున్న మిగిలిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుని పార్టీ బీ–ఫామ్ ఇచ్చిన అభ్యర్థులకు సహకరించాలని జగ్గారెడ్డి సూచిస్తున్నారు.

# విచారణ కమిషన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి** – అంశాలు, ప్రభుత్వానికి సమర్పించిన అంశాల్లో తేడాలను మంత్రివర్గం గుర్తించింది. విచారణలో ఉన్న వాస్తవాలు ఛార్జ్ షీట్‌లో ఎందుకు మిస్ అయ్యాయనే దానిపై ప్రధానంగా చర్చ జరిగింది. విచారణ అంశాలు, ఛార్జ్ షీట్‌లో అంశాలు, ప్రభుత్వ నివేదికలో తేడాలపై అధ్యయనం చేసి వాస్తవాలను సమర్పించేందుకు విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కమిటీ ఏర్పాటు చేసి నిర్ణీత కాలపరిమితిలో నివేదిక తెప్పించుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది.తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు మీడియాకు వివరించారు. తప్పు జరుగుతోందని తెలిసినా నాటి పాలకులు మౌనంగా ఉన్నారని స్పష్టమవుతోందన్నారు. సిట్ నివేదికతో పాటు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న సమాచారం పైనా సుదీర్ఘంగా చర్చించామన్నారు. తిరుమల లడ్డూలో పందికొవ్వు కలిసిందని ఎన్డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని పయ్యావుల గుర్తు చేశారు. బీఫ్ టాలో, లార్డ్, ఫిష్ ఆయిల్ లడ్డూకి వాడిన రసాయనాల్లో వాడినట్లు ఎన్డీడీబీ నిర్ధారించిందని వెల్లడించారు. తన వద్దకు వచ్చిన వాస్తవాలు సీఎం ప్రజల ముందు పెట్టాలా వద్దా అని ప్రశ్నించారు.ఎన్డీడీబీ నివేదిక తరహాలోనే లడ్డూలో రసాయనాల వాడకంపై 2022 వైఎస్సార్సీపీ హయాంలోనే సీఎఫ్టీఆర్ఐ నాటి ప్రభుత్వానికి ఇచ్చిందన్నారు. ఆ నివేదిక ఆధారంగా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా మరింత ప్రోత్సహించటాన్ని ఏమి అనాలని నిలదీశారు. చుక్క పాలు లేకుండా నెయ్యి అంటూ రసాయనాలు తయారు చేసిన విధానంపై ప్రజల్లో చర్చ జరగాలని పిలుపునిచ్చారు. ఫేక్ డాక్యుమెంట్స్ తో వైష్ణవి డెయిరీ నెయ్యి కొనుగోళ్లు టెండర్లలో పాల్గొంటోందని తెలిసి కూడా నాడు మౌనం వహించిన వారంతా నేరస్థులేనని వ్యాఖ్యానించారు. ఘోరమైన నేరంలో భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకోవడం కోసమే విచారణ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని తేల్చి చెప్పారు.తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప రాజకీయ కోణం ఇందులో లేదు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోంది.



తిరుమల లడ్డూలో కల్తీ జరిగింది కానీ జంతు కొవ్వు లేదన్నట్లు వైఎస్సార్సీపీ నేతల మాటలు ఉన్నాయి. లడ్డూలో కల్తీని వైఎస్సార్సీపీ సమర్థిస్తోందా? 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. హిందూ ధర్మం మూలలను దెబ్బతీసే విధంగా వైసీపీ చర్యలు ఉన్నాయి. అజెండా అంశాలు పక్కన పెట్టి మరీ కల్తీ లడ్డూ వ్యవహారంపైనే చర్చించాం. –పయ్యావుల కేశవ్, పార్థసారథి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, మంత్రులు

**గత ప్రభుత్వ హయాంలోనే కల్తీ :** వైఎస్సార్సీపీ హయాంలో టెండర్ నిబంధనల్ని సడలించటంతోనే కల్తీకి బీజం పడిందని కేబినెట్ అభిప్రాయపడింది. ఈవోగా ఉన్న సింఘాల్ సడలించిన నిబంధల్ని తిరస్కరించే విచక్షణాధికారం ఉన్నప్పటికీ ఆ దిశగా నిర్ణయం తీసుకోకపోవటాన్ని మంత్రివర్గం తప్పుబట్టింది. వైఎస్సార్సీపీ హయాంలో 2022లో చేయించిన సీఆర్టీఐ నివేదికలోనే కల్తీ నిర్ధారణ అయినా చర్యలు తీసుకోకపోవటాన్ని మంత్రివర్గం తప్పుబట్టింది.సిట్ నివేదికతోపాటు ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంపై కేబినెట్ లోతుగా చర్చించింది. లడ్డూలో రసాయనాలు వాడకం అంశంలో విస్తుపోయే అంశాలు బయట పడుతున్నాయని మంత్రులు తెలిపారు. అడ్వకేట్ జనరల్‌ను మంత్రివర్గం కేబినెట్‌కు పిలిపించింది. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్‌తో చర్చించారు. నివేదికలోని ప్రతి అంశంపై లోతుగా మంత్రివర్గంలో చర్చించారు.

**మంత్రి పార్థసారథి వివరణ :** వైఎస్సార్సీపీ హయాంలో కొనుగోలు కమిటీలో తాను, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సభ్యులుగా ఉన్నా తమని సమావేశానికి కనీసం ఆహ్వానించలేదని మంత్రి పార్థసారథి క్యాబినెట్ దృష్టికి తీసుకొచ్చారు. తమను పిలవకపోగా కొనుగోలు కమిటీలో సభ్యులు కానీ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్న విషయాన్ని మంత్రివర్గానికి పార్థసారథి వివరించారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కమిటీలో లేని కరుణాకర్‌రెడ్డిలు నిబంధనలు సడలించి కల్తీకి తెరలేపారని మంత్రివర్గం అభిప్రాయపడింది. కల్తీ రసాయనాలతో 20 కోట్ల లడ్డూలను తయారుచేసి పంపిణీ చేయటాన్ని తీవ్రంగా మంత్రివర్గం తప్పుబట్టింది. అయోధ్య రామమందిరానికి సైతం అవే కల్తీ లడ్డూలు సరఫరా చేయటాన్ని మంత్రివర్గం మహాపాపంగా తెలిపింది.

**మరింత సమాచారం :** సీఎం చంద్రబాబు కూటమి మంత్రులందరితో విడిగా భేటీ అయ్యారు. కేబినెట్ అజెండా అంశాలు పక్కన పెట్టి సమావేశమయ్యారు. సీఎంతో భేటీలో పవన్ కల్యాణ్, సత్యకుమార్, నారా లోకేశ్‌లు పాల్గొన్నారు. అజెండా అంశాలను పక్కన పెట్టి తిరుమల శ్రీవారి లడ్డూపై సిట్ ఇచ్చిన నివేదికపై చర్చించాలని నిర్ణయించారు.

**టర్నోవర్ రూ.150 కోట్లకు తగ్గింపు :** సిట్ ప్రభుత్వానికి రాసిన 14 పేజీల లేఖలోని చివరి పేరాలో కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి అప్పట్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించింది. నెయ్యి సరఫరాకు ఉన్న నాణ్యతా ప్రమాణాలను బలహీనపరిచేలా వ్యవహరించారని, నిబంధనల తయారీలో మనసు పెట్టకుండా పనిచేశారని పేర్కొంది. దీనివల్ల నెయ్యి నాణ్యతలోనూ రాజీ జరిగిందని తెలిపింది. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరాకు 2019 ముందున్న కఠిన నిబంధనలను వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే మార్చేశారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలు పాలు సేకరించాల్సిన అవసరం లేదని, వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో పని లేదని సడలించారు. మూడేళ్లపాటు కార్యకలాపాలు నిర్వహించాలనే నిబంధనకు మినహాయింపు ఇచ్చారు. టర్నోవర్ మొత్తాన్ని రూ. 250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గించారు.

# నెయ్యి కల్తీపై ఏపీ కేబినెట్ సీరియస్

**మొదటిపేజీ తరువాయి** – నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ మీడియా సమావేశంలో కేబినెట్ చర్చల వివరాలను వెల్లడించారు.ఈ అంశంపై రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని, కేవలం భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, శ్రీవారి క్షేత్ర పవిత్రతను పునరుద్ధరించడమే తమ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా మంత్రులందరూ ఈ అంశంపై తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారని తెలిపారు.

**కొలుసు పార్థసారథి ఏమన్నారంటే..**

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, "కోట్లాది మంది హిందువులు ఆరాధించే ఏడుకొండలవాని సన్నిధిలో జరిగిన ఈ మహాపాపం గురించి సీబీఐ ఇచ్చిన నివేదికపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. హిందువుల మనోభావాలను, తిరుమల పవిత్రతను కాపాడటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మంత్రులందరూ అభిప్రాయాలు తెలిపారు. సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ, కోర్టు ఇంకా కాగ్నిజెన్స్‌లోకి తీసుకోలేదు. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ తప్పిదాలను సరిదిద్దేందుకు, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది," అని అన్నారు.

**పయ్యావుల కేశవ్ వివరణ..**

ఈ వ్యవహారంలోని సాంకేతిక, చట్టపరమైన అంశాలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. "సీబీఐ నుంచి ప్రభుత్వానికి 11 పేజీల నివేదిక అందింది. ఇందులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఉద్దేశపూర్వక తప్పిదాలను స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్‌డీబీ–సీఏఎల్ఎఫ్ ఇచ్చిన ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం నెయ్యిలో సోయాబీన్, ఫిష్ ఆయిల్, బీఫ్ టాలో (జంతు కొవ్వు), లార్డ్ వంటివి ఉండే అవకాశం ఉందని (సస్పెక్టెడ్ అడల్టరెంట్స్) తేలింది. ఈ నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనాడు ఆరోపణలు చేశారు" అని కేశవ్ తెలిపారు."2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ రిపోర్టులో కల్తీ జరిగిందని తేలినా, నాటి టీటీడీ అధికారులు, పాలకమండలి చైర్మన్ దానిని తొక్కిపెట్టారు. గతంలో చంద్రబాబు హయాంలో నెయ్యి కొనుగోలుకు కఠిన నిబంధనలు పెట్టారు. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చాక కేవలం ఐదు నెలల్లోనే ఆ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా సడలించారు. పాలు సేకరించే సామర్థ్యం లేని సంస్థలకు, టర్నోవర్ తగ్గించి, అనుభవం లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టారు. బోలే బాబా వంటి సంస్థలకు టెండర్ దక్కించుకోవడానికి వైవీ సుబ్బారెడ్డి పీఏ ప్రయత్నించినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్లలో పాల్గొన్నా అధికారులు అడ్డుకోలేదు. ఈ తప్పులన్నింటికీ నాటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఏఈవో ధర్మారెడ్డి, సీఏవో బాలాజీ బాధ్యులని సీబీఐ నివేదికలో పేర్కొంది. వారిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది," అని పయ్యావుల కేశవ్ వివరించారు.

**నాదెండ్ల మనోహర్ స్పందన..**

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, ఈ అంశంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని చెప్పారు. "కేబినెట్ సమావేశానికి అడ్వకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి న్యాయపరమైన సలహాలు తీసుకున్నాం. భక్తుల మనోభావాలతో ఆడుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. 2022లో కల్తీ రిపోర్ట్ వచ్చాక, గత ప్రభుత్వం ఒక్కసారి కూడా నెయ్యి శాంపిల్స్‌ను టెస్టుకు పంపలేదు. ఎందుకంటే అందులో అసలు నెయ్యే లేదు. కానీ, మా కూటమి ప్రభుత్వం వచ్చాక 12 నుంచి 15 సార్లు నాణ్యతా పరీక్షలు చేయించాం. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం" అని స్పష్టం చేశారు.

**సత్యకుమార్ యాదవ్ ఆరోపణలు.. :** మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, వైసీపీ నాయకత్వం హిందూ ధర్మం మూలాలనే దెబ్బతీసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. "కల్తీ జరిగిందని వైసీపీ నేతలే ఒప్పుకుంటున్నారు. అంటే, శ్రీవారి ప్రసాదంలో కల్తీని సమర్థిస్తున్నారా? అసలు పాలు లేకుండా నెయ్యి ఎలా తయారు చేస్తారు? రూ.250 కోట్ల అవినీతి కోసం కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారు. గతంలో తిరుమలలో ఏడు కొండలకు బదులు రెండే ఉన్నారని వాదించడం, అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించడం, డిక్లరేషన్ ఇవ్వకుండా దర్శనాలు చేయడం వంటి చర్యలతో ఆలయ పవిత్రతను మంటగలిపారు. ఈ బోలే బాబా డైరీని దొడ్డిదారిన తెచ్చిన అలీబాబా ఎవరో, దాని వెనకున్న 40 దొంగలు ఎవరో ప్రజలకు తెలియాలి," అని సత్యకుమార్ యాదవ్ ఘాటుగా విమర్శించారు.

# భారత రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

**మొదటిపేజీ తరువాయి** – భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని అందుకుంది. సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షతో సుదూర గగనతల క్షిపణుల తయారీలో భారత్ స్వయంసమృద్ధి దిశగా మరో ముందడుగు వేసినట్లయింది. మంగళవారం ఉదయం 10:45 గంటల సమయంలో ఈ పరీక్షను నిర్వహించారు. ముందుగా గ్రౌండ్ బూస్టర్ సాయంతో క్షిపణి వ్యవస్థను నిర్దేశిత వేగానికి చేర్చారు. ఆ తర్వాత, నాజిల్–లెస్ బూస్టర్, రామ్‌జెట్ మోటార్ వంటి అన్ని ఉప వ్యవస్థలు ప్రణాళిక ప్రకారం అత్యంత కచ్చితత్వంతో పనిచేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐటీఆర్‌లో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా నమోదు చేసి, ధృవీకరించారు.ఈ అత్యాధునిక టెక్నాలజీ విజయవంతం కావడంతో భారత్‌కు గగనతలంలో గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనం లభించనుంది. శత్రు విమానాలను చాలా దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పరిజ్ఞానం కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ చేరింది.డీఆర్‌డీవోకు చెందిన డీఆర్‌డీఎల్, హెచ్ఈఎంఆర్ఎల్, ఆర్‌సీఐ వంటి ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహించాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, సంబంధిత పరిశ్రమలను అభినందించారు. ఇది భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.



# లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత

**మొదటిపేజీ తరువాయి** – పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ ఛైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు."ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా



స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదా యాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడ టానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండి పడ్డారు.తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

## మేడారం జాతర విజయవంతం

**మొదటిపేజీ తరువాయి** – ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు.ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా



మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

ప్రజా మంటలు

బుధవారం 04 - 02 - 2026

# జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా కుక్కలకు ఉచిత టీకాలు

## రేబిస్ నివారణే లక్ష్యం భీమదేవరపల్లిలో ఉచిత టీకాల కార్యక్రమం



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 03 (ప్రజా మంటలు)** :మండల కేంద్రంలోని భీమదేవరపల్లి పశు వైద్యశాలలో జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా "ఆంటీ రేబిస్" టీకాలు వేసే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి హాజరై టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి మనుషులను, జంతువులను రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ తమ పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. పశు వైద్యాధికారి మాలతి మాట్లాడుతూ, రేబిస్ వ్యాధి నివారణలో టీకాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ పరిధిలోని పెంపుడు కుక్కల యజమానులు పెద్ద సంఖ్యలో హాజరై తమ కుక్కలకు టీకాలు వేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, కుక్కల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్‌కు 'ఫెర్టిలైజర్ యాప్' ప్రయోగాత్మకంగా అమలు

## యాప్‌లో బుక్ చేసిన రైతులకే యూరియా సరఫరా

## పంట వివరాలు నమోదు తప్పనిసరిడ యూరియా బుకింగ్‌కు కొత్త నిబంధనలు




**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 02 (ప్రజా మంటలు)** :రైతులు యూరియాను తమ ఇంటి నుంచే బుక్ చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. "ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్" ద్వారా యూరియాను బుక్ చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిని పద్మ తెలిపారు. ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. యాప్‌లో రైతు తన పట్టాదార్ పాస్‌పుస్తకం నంబర్ నమోదు చేయగానే దానికి అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) వస్తుంది. ఆ ఓటీపీని నమోదు చేసిన వెంటనే రైతుకు సంబంధించిన భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంట వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. సాగు చేస్తున్న పంట ఆధారంగా అవసరమైన యూరియా పరిమాణాన్ని యాప్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. బుకింగ్ పూర్తయ్యాక రైతులు అధీకృత ఎరువుల రిటైలర్లు లేదా సహకార సంఘాల ద్వారా యూరియాను కొనుగోలు చేసుకోవచ్చు. రైతులు యాప్‌లో నమోదు చేసే పంట వివరాలు వాస్తవంగా సాగు చేస్తున్న పంటతో సరిపోలాలి. తప్పు పంట వివరాలు నమోదు చేస్తే భవిష్యత్తులో పంట అమ్మకానికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ విధానం ద్వారా ఎరువుల దుర్వినియోగం నివారించడంతో పాటు, నిజమైన రైతులకు మాత్రమే యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# జగిత్యాల మాల జంగం పురోహితులచే రాజరాజేశ్వర స్వామి పల్లకి సేవ



**జగిత్యాల ఫిబ్రవరి 3 ( ప్రజా మంటలు) :** మాల జంగం కు చెందిన వేల్పుల వంశస్థులు మంగళవారం రాజరాజేశ్వర స్వామి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా మంచినీళ్ల భావి వద్ద గల శ్రీ మదేలేశ్వర స్వామి ఆలయంలో మాల జంగం పురోహితులు లక్కం శివనాథం, మురళీదాస్, మోహన్, కోదాది సాంబయ్య తదితరులు సామూహికంగా భజనలు చేశారు. అనంతరం శ్రీ మదేలేశ్వర స్వామికి పూజలు చేశారు .వేల్పుల కుటుంబాల వారు ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి ఈ ఉత్సవం నిర్వహిస్తారని పురోహితులు లక్కం శివనాథం తెలిపారు. అనంతరం వేల్పుల కుటుంబాల వారు పల్లకిలో వేంచేసిన శివుని పంచలోహ విగ్రహానికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పురాణపేటలోని ఆలయానికి ఉత్సవ విగ్రహాన్ని చేర్చారు .ఈ తంతు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారని పురోహితులు తెలిపారు. సోమవారం శివుని పంచలోహ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం ఊరేగింపుగా స్వామిని మాల కుటుంబాల వారి ఇంటింటా దర్శింపచేసారు.

# ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి: రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి



**జగిత్యాల, ఫిబ్రవరి 3 (ప్రజా మంటలు) :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, భద్రతపై జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే వ్యాఖ్యలపై సైబర్ విభాగం ద్వారా చర్యలు తీసుకోవాలని, ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రత కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రఘు చందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

# బి.ఎల్.ఓ లు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత



**జగిత్యాల ఫిబ్రవరి 3 ( ప్రజా మంటలు) :** పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో బి.ఎల్.ఓ లు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బి.ఎల్.ఓల పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు చేయాలని మరియు వివరాలు సరిచూడాలన్నారు. బాధ్యతాయుతమైన పని విధానం అవసరమన్నారు. లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాం మోహన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ వరదన్, బి ఎల్ వో లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిస్థాయి ఆరోగ్యం సాధ్యం

## మెడికవర్ హాస్పిటల్స్ వైద్యనిపుణులు



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 03 (ప్రజా మంటలు):** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం (ఫిబ్రవరి 4) సందర్భంగా సికింద్రాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో "యునైటెడ్ బై యూనిక్" నినాదంతో ప్రత్యేక అవగాహన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్‌ను జయించిన సర్వైవర్లు పాల్గొని, ప్రారంభ దశలో గుర్తింపు మరియు సకాలంలో చికిత్స ప్రాముఖ్యతను తమ అనుభవాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. నివేద్ రావు బల్మూరి మాట్లాడుతూ... దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. జీవితకాలంలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అయితే ప్రారంభ దశలో గుర్తిస్తే 50 శాతం కంటే ఎక్కువ కేసులను నివారించవచ్చని లేదా పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రారంభ దశలో గుర్తించిన రోగుల్లో 70 నుంచి 90 శాతం వరకు జీవన అవకాశాలు ఉంటాయని వివరించారు. కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డా. గౌతమ్ మాట్లాడుతూ... క్యాన్సర్‌పై భయం, అపోహల కారణంగా చికిత్స ఆలస్యం అవుతోందని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ వంటి ఆధునిక చికిత్సలతో ప్రారంభ దశలో మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్యాన్సర్ సర్వైవర్లు తమ అనుభవాలను పంచుకుంటూ, సకాలంలో వైద్యులను సంప్రదించడం, క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవడం వల్లే ఆరోగ్యం సాధ్యమైందని చెప్పారు. కొత్తగా క్యాన్సర్ నిర్ధారణ అయిన రోగులకు మార్గనిర్దేశం చేసే 'ఫస్ట్ రెస్పాండర్స్'గా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. అలాగే క్యాన్సర్ నుంచి కోలుకున్న సర్వైవర్లు మరియు వారి కుటుంబ సభ్యులకు మెడికవర్ హాస్పిటల్స్ ఫ్యామిలీ కార్డులను పంపిణీ చేశారు. చికిత్స అనంతరం కూడా నిరంతర వైద్య మద్దతు అందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

# ముత్తారం త్రికుటేశ్వరాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

## పార్కింగ్, క్యూ లైన్లపై సూచనలు చేసిన ఎస్సై రాజు





**భీమదేవరపల్లి ఫిబ్రవరి 03 (ప్రజా మంటలు)** :ముత్తారం గ్రామంలోని శ్రీ త్రికుటేశ్వరాలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఎస్సై రాజు మంగళవారం పరిశీలించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు, భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై ఎస్సై సమీక్షించారు. మూడు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని టీటీడీఎస్ (త్రికుటేశ్వరాలయ టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ) చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి ఎస్సై రాజుకు వివరించారు. పోలీస్ శాఖతో పాటు టీం సభ్యుల సమన్వయంతో భక్తుల సౌకర్యాలు పూర్తి చేస్తామని తెలిపారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ఆలయ పరిసరాల్లో బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో తగినంత లైటింగ్ ఉండేలా చూడాలని ఎస్సై సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊరడి జైపాల్ రెడ్డి, మామిడాల చంద్రశేఖర్, కాశిరెడ్డి నరేందర్ రెడ్డి, వడ్డేపల్లి చక్రపాణి, దేవరాజు సురేష్, నరేష్, వనపర్తి శ్రీనివాస్, హింగే తిరుపతి, మామిడాల శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగూర్ల ఎన్నిక

## నాగూర్ల రైతు సమాజానికి మేలు

## నాగూర్ల వెంకటేశ్వర్లకు శుభాకాంక్షలు

## టి ఆర్ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్





**ఎల్కతుర్తి ఫిబ్రవరి 03 ప్రజా మంటలు** :తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాగూర్ల వెంకటేశ్వర్లకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ఎల్కతుర్తి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూకినే సంతాజి అదేవిధంగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా హన్మకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు, నాయకులతో కలిసి హనుమకొండలోని ఆయన నివాసంలో నాగూర్ల వెంకటేశ్వర్లకు హృదయపూర్వకంగా శాలువాతో సన్మానించి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ఎరువులు విత్తనాలు అందించడంలో ఫర్టిలైజర్ షాపు వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన పదవికి నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడం రైతు సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను గుర్తించి పరిష్కార దశగా ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫర్టిలైజర్ రంగంలో ఉన్న అనుభవం సేవాభావం నాయకత్వ లక్షణాలతో నాగూర్ల వెంకటేశ్వర్లు ఈ పదవికి పూర్తిగా న్యాయం చేస్తారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా కమిటీ విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మరోసారి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు తెలిపారు.

# కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరిగింది

## జీవన్ రెడ్డి



**జగిత్యాల, ఫిబ్రవరి 3 (ప్రజా మంటలు):** రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా, నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేయడమే నా తప్పా? అని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రశ్నించారు. జగిత్యాల ఇందిరా భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూకష్టకాలంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు టికెట్లు ఇవ్వాలని కోరడమే తాను చేసిన పని అన్నారు. కాంగ్రెస్ జెండా మోసిన వారిని పక్కనబెట్టి, వలసవాదులు, అవకాశవాదులకు బీ ఫారాలు ఇవ్వడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యేతో కలిసి మున్సిపల్ టికెట్లపై చర్చించడం క్రమశిక్షణకు విరుద్ధమని, నిజమైన కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని సహించేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను అతిక్రమిస్తూ జరుగుతున్న పరిణామాలను అఖిల భారత నాయకులు ఖర్గే, రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

## జిల్లా పరిషత్ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**మెట్ పెల్లి ఫిబ్రవరి 3 (ప్రజా మంటలు)** :మండలంలోని బండ లింగపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్య బోధన విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, మౌలిక వసతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు వైద్య పరీక్షలు సకాలంలో చేయాలి. ప్రభుత్వ మెను ప్రకారం రోజువారి వంటకాలు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందే విధంగా సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి కె. రాము, ఎంఈవో చంద్ర శేఖర్, మండల తహసిల్దార్ నీత, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ కు సర్ సి.వి రామన్

## ఉన్నత పాఠశాల నుండి 10 మంది విద్యార్థులు బంగారు పతకాలకు ఎంపిక



**హుస్నాబాద్,ఫిబ్రవరి3,(ప్రజా మంటలు)** :హుస్నాబాద్ పట్టణంలోని సర్. సి.వి. రామన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు నేషనల్ అస్ట్రానమీ సైన్స్ ఒలంపియాడ్ వారు డిసెంబర్ లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లెవల్-1 లో ఉత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించినారు, వారు పెసరు జయ్, బొమ్మగాని ఆయుశ్రీ, గుండు వ్యాసనందన్, కాపర్తి తేజశ్విని, నారాయణ పురం రుత్విక, గాడిపెసాన్విశ్రీ, తుమ్మ దృతిక, పోగుల సుహాన్ శౌర్య, గుండు అగస్త్యనందన్, బుర్ర శ్రీనిధి. అయితే లెవల్ -2 లో ప్రతిభ కనబరచిన వారిని మనదేశం యొక్క ఇస్రో కేంద్రానికి మరియు అమెరికాలోని నాసా కేంద్రానికి ఎంపిక చేయడం జరుగుతుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కాయిత నారాయణరెడ్డి గారు మాట్లాడుతూ నాసో వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ఒలంపియాడ్ లెవల్ -1 లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకొని గొప్పసైంటిస్టులు కావాలని అన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో సైన్స్ అనేది ఒక ముఖ్య భాగం అని సైన్స్ అండ్ టెక్నాలజీపట్లా నేడు పెరుగుతున్న విజ్ఞానాన్ని విద్యార్థులు సృజనాత్మకంగా పరిశీలన చేసి నేర్చుకోవాలని అన్నారు. నాసో వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లెవెల్ - 1 లోబంగారు పతకాలుసాధించిన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఇట్లు ప్రధానోపాధ్యాయులు సర్ సి.వి.రామన్(ఇ/మీ) ఉన్నత పాఠశాల హుస్నాబాద్.

# మెట్ పెల్లి ప్రభుత్వ ఆసుపత్రి ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మెట్ పెల్లి ఫిబ్రవరి 3 (ప్రజా మంటలు)** :పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పరిశుభ్రత పరిస్థితులు, సిబ్బంది హాజరు తదితర అంశాలనుజిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా వైద్యులు మరియు సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి కో- ఆర్డినేటర్ రామకృష్ణ, ఆసుపత్రి సూపరింటెంట్ సాజిద్ అహ్మద్, ఎమ్మార్వో నీత, వైద్యులు మరియు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎం హెచ్ ,సుజాత



**గొల్లపల్లి ఫిబ్రవరి 03ప్రజా మంటలు** :గొల్లపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుజాత ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలు ఆస్పత్రిలో చూపించుకోవడానికి వచ్చిన వారికి యోగా మరియు పోషకాహారం అనంతరం సాధారణ ప్రభుత్వ డెలివరీ ల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అలాగే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సమీక్షించారు. బీపీ షుగర్ క్యాన్సర్ థైరాయిడ్ మొదలగు వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు గర్భిణీలకు యోగ వ్యాయామం లాంటి సాధనాలు చేయాలని ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీ చేయించుకునేలా అవగాహన కల్పించారని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యంసాని శ్రీకాంత్, డిపి హెచ్ఎన్ఓ జ్యోతి డిపిఓ రవీందర్ ఆరోగ్య పర్యవేక్షకులు నరేందర్ స్టాఫ్ నర్స్ లో శారద ఇన్ జ్యోతి ఫార్మసిస్ట్ ఇన్ లతా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారి ఆధ్వర్యంలో 2.2కోట్ల నగదు బహుమతులు



**గొల్లపల్లి ఫిబ్రవరి 03 ప్రజా మంటలు** :తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి నగదు బహుమతులు సాధించాలని గొల్లపల్లి సామాజిక సేవకులు నల్ల సతీష్ రెడ్డి కోరారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు ప్రతిబావంతులపై విద్యార్థులకు అందించే నగదు బహుమతి పోస్టర్ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ వారు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించడానికి 2.2 కోట్ల నగదు బహుమతి అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు నగదు బహుమతి సాధించే విధంగా కష్టపడి చదివి ర్యాంకులు సాధించాలని విద్యార్థులకు తెలిపారు. రాష్ట్రస్థాయిలో స్టేట్ ఫస్ట్ పొందిన విద్యార్థికి ఐదు లక్షలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి మూడు లక్షలు, ప్రతి జిల్లా టాపర్ కు రెండు లక్షలు, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లోని ప్రతి నియోజకవర్గ టాపర్ కు లక్ష రూపాయలు, రాష్ట్రంలోని 612 మండలాల్లో ప్రథమ స్థానాన్ని పొందిన విద్యార్థులకు పదివేల రూపాయల చొప్పున నగదు బహుమతి అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# కుగ్రామం నుంచి స్మార్ట్‌సిటీ వరకు కరీంనగర్ ప్రస్థానం

**74 ఏళ్ల ప్రస్థానంలో కరీంనగర్ అనేక మైలురాళ్లు**

**స్మార్ట్‌సిటీ హోదా సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కీలక నగరం**

**మున్సిపాలిటీ నుంచి నగరపాలిక వరకు**

**స్మార్ట్‌సిటీగా కరీంనగర్ రూపాంతరం**

1952 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 74 ఏళ్ల ప్రస్థానంలో కరీంనగర్ అనేక మైలురాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతోంది. ఒకప్పుడు మూడో గ్రేడ్ మున్సిపాలిటీగా ప్రారంభమైన ఈ పట్టణం నేడు స్మార్ట్‌సిటీ హోదా సాధించి తెలంగాణ రాష్ట్రంలో కీలక నగరంగా మారింది. ఉద్యమాల ఖిల్లాగా గుర్తింపు పొందిన కరీంనగర్ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎప్పటికప్పుడు తన ఉనికిని చాటుకుంటూనే వస్తోంది.

మానేరు ఒడ్డున పుట్టిన ఆరిఫిరాల గ్రామం : కరీంనగర్ చరిత్రను వెనక్కి తిరిగి చూస్తే, మానేరు నదికి ఉత్తరాన ఉన్న ఆరిఫిరాల అనే చిన్న కుగ్రామం కనిపిస్తుంది. ప్రస్తుతం పాతబజార్‌లోని శివాలయం పరిసర ప్రాంతమే అప్పట్లో ఆరిఫిరాల గ్రామం. ఈ ప్రాంతం అనేక రాజవంశాల పాలనను చూసింది. క్రీస్తుశకం 978 నుంచి 1153 వరకు కల్యాణి చాళక్యులు, ఆ తర్వాత కాకతీయులు, కుతుబుషాహీలు, మొగలాయిలు, చివరగా అసఫ్‌జాహీల పాలనలో కొనసాగింది.



కరీంనగర్ టవర్‌సర్కిల్

**కరినగర్‌గా మారిన పట్టణం :** 16వ, 17వ శతాబ్దాల్లో కుతుబుషాహీల కాలంలో గోల్కొండ నుంచి అరబ్బులు వ్యాపార నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చేవారు. వర్షాకాలంలో మానేరు నది ఉప్పొంగడంతో నదిని దాటేందుకు ఏనుగులను ఉపయోగించేవారు. 'కరి' అంటే ఏనుగు అనే అర్థంతో ఈ ప్రాంతాన్ని కరినగర్‌గా పిలిచినట్లు చరిత్ర చెబుతోంది. కాలక్రమేణా అదే పేరు కరీంనగర్‌గా మారింది.

**కరీముల్లాషా బాబా ప్రభావం :** 19వ శతాబ్ద ప్రారంభంలో కరీముల్లాషా బాబా ఈ ప్రాంతంలో నివసించేవారు. ఆయన ప్రజలపై చూపిన ప్రభావానికి గుర్తుగా పాతబజారులో కరీముల్లాషా దర్గా నిర్మించారు. అసఫ్‌జాహీల పాలనలో ఎలగందుల సర్కార్‌కు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతానికి ఖిలేదారుగా కరీముల్లాషా బాబా వ్యవహరించారు. ఆయన పేరునే పట్టణానికి ఖరారు చేశారనే వాదన చరిత్రలో ఉంది.

**పోలీసు చర్య అనంతర మార్పులు :** 1948 సంవత్సరం సెప్టెంబరులో జరిగిన పోలీసు చర్య తర్వాత తెలంగాణ భారతదేశంలో విలీనమైంది. ఈ రాజకీయ పరిణామం కరీంనగర్ అభివృద్ధికి కీలక మలుపుగా మారింది. 1952 సంవత్సరంలో కరీంనగర్ పట్టణం మూడో గ్రేడ్ పురపాలికగా ఏర్పడింది. అప్పటి నుంచి మౌలిక సదుపాయాల అభివృద్ధి క్రమంగా మొదలైంది.

**మున్సిపాలిటీ నుంచి నగరపాలిక వరకు :** కాలానుగుణంగా జనాభా పెరుగుదల, వాణిజ్య విస్తరణ, విద్యా రంగ అభివృద్ధితో కరీంనగర్ ప్రాధాన్యం మరింత పెరిగింది. 2005లో నగరపాలిక హోదా సాధించడంతో పరిపాలనలో కొత్త దశ ప్రారంభమైంది. రహదారులు, డ్రైనేజీ, తాగు నీరు, విద్యుత్, వైద్య సదుపాయాల్లో స్పష్టమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

**మహిళా నాయకత్వానికి గుర్తింపు :** కరీంనగర్ పాలకవర్గ చరిత్రలో మహిళా నాయకత్వానికి కూడా స్థానం దక్కింది. ఒకేసారి ఛైర్‌పర్సన్‌గా ప్రేమలతాదేవి బాధ్యతలు నిర్వహించడం విశేషం. ఇది స్థానిక పాలనలో మహిళల భాగస్వామ్యానికి ఒక మైలురాయిగా నిలిచింది.

**స్మార్ట్‌సిటీగా కరీంనగర్ :** నేడు కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ హోదా పొందింది. ఐటీ, విద్య, వైద్య, వాణిజ్య రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ సేవలు, పర్యావరణ హిత ప్రాజెక్టులతో భవిష్యత్తు నగరంగా రూపాంతరం చెందుతోంది. ఉద్యమాల ఖిల్లాగా ప్రత్యేక గుర్తింపు : కరీంనగర్ కేవలం అభివృద్ధి నగరమే కాదు. రాజకీయ, సామాజిక ఉద్యమాలకు కేంద్రంగా నిలిచింది. తెలంగాణ ఉద్యమం సహా అనేక ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించింది. ప్రజాస్వామ్య చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఈ నగరం ఎక్కడా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగుతోంది.

**భవిష్యత్తు దిశగా అడుగులు :** కుగ్రామంగా ప్రారంభమైన కరీంనగర్ నేడు స్మార్ట్‌సిటీగా ఎదగడం వెనుక ప్రజల సంకల్పం, నాయకుల పాత్ర, ఉద్యమాల స్ఫూర్తి దాగి ఉన్నాయని పలువురు అంటున్నారు. చరిత్రను గౌరవిస్తూ, ఆధునికతను ఆహ్వానిస్తూ కరీంనగర్ తన స్థానం పదిలపర్చుకుంటూ భవిష్యత్తు వైపు దూసుకెళ్తోంది.

# రోడ్డు ప్రమాదాల్లో ఏటా 8 వేల మంది మృతి

**అందులో సగం ద్విచక్రవాహనదారులే**

**2020-2025 నవంబరు వరకు 1,20,657 రోడ్డు ప్రమాదాలు**

**అందులో 59,724 ద్విచక్ర వాహన ప్రమాదాలే**

**మితిమీరిన వేగం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణాలు**

ఏ వైపు నుంచి ప్రమాదం పొంచి ఉందో, ఎప్పుడు ఎవరి ప్రాణం ఎలా పోతుందో అని ఎవరూ చెప్పలేని పరిస్థితి. బైక్‌పై రోడ్డెక్కిన మనిషి ఇంటికి వచ్చేదాక ఆ కుటుంబ సభ్యులకు అదో పెద్ద ఆందోళనే. రాష్ట్రంలో జరుగుతున్న ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో ఎక్కువ మంది ద్విచక్రవాహనదారులేనని సంబంధిత గణాంకాలు తెలుపుతున్నాయి. మితిమీరిన వేగం, హెల్మెట్ పెట్టుకోవాలన్న స్పృహ కూడా లేకపోవడమే శాపాలవుతున్నాయని నిపుణులు తెలుపుతున్నారు. ప్రాణం విలువ బంధాన్ని కోల్పోయిన ఆ కుటుంబానికి మాత్రమే తెలుస్తుంది. కాస్త జాగ్రత్తగా ఉండని ఏమరపాటు నిర్లక్ష్యం అంతులేని విషాదాన్ని నింపుతుంది. నిండు నూరేళ్ల జీవితాన్ని హరిస్తుంది. వారిని ప్రేమించే వారిని, వారిపై ఆధారపడ్డ వారిని సుడిగుండంలోకి నెట్టేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా సగటున 8 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో 50 శాతం ద్విచక్రవాహనదారులే ఉండటం గమనార్హం. తలకు బలమైన గాయాలవ్వడం వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. బైక్ నడిపేవాళ్లు, వెనక కూర్చొన్న వాళ్లు హెల్మెట్ ధరిస్తే ప్రమాదం జరిగినా, ప్రాణాలు నిలబడతాయని తెలిసినా ఇంకా చాలా మంది నిర్లక్ష్యంగానే ఉంటున్నట్లు, ఏమవుతుందిలే అన్న ధీమా వారి ప్రాణాలను బలిగొంటోంది. హెల్మెట్ ధరించకపోవటం వల్ల రాష్ట్రంలో ఏటా సగటున 2,500–3,000 ప్రాణాలు రోడ్డుపాలవుతున్నాయి. కారణాలివే: అతి వేగం కారణంగానే ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. మితిమీరిన వేగంతో బండి నడిపేటప్పుడు ఆకస్మికంగా వాహనాన్ని అదుపు చేయడం కష్టమవుతోంది. దీంతో తీవ్ర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బైక్ డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్లో మాట్లాడటం, మద్యం మత్తులో వాహనం నడపటం, నిబంధనలు సరిగ్గా పాటించకపోవడం కూడా ప్రమాదాలను సంఖ్యను పెంచుతున్నాయి. ఓవర్‌టేక్ చేస్తున్నప్పుడు ఎక్కువ యాక్సిడెంట్లు చోటు చేసుకుంటున్నాయి. ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించాలంటే ఎంత వేగంతో వెళ్లాలనేది కచ్చితంగా అంచనా వేయలేకపోవటం, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయటం వంటివి ఘటనల సంఖ్యను పెంచుతున్నాయి. రాష్ట్రంలో 2020 నుంచి 2025 నవంబరు వరకూ 1,20,657 రోడ్డు ప్రమాదాలు జరగగా అందులో 59,724 (49.49 శాతం) ద్విచక్ర వాహన ప్రమాదాలే. ఆరేళ్ల గణాంకాలు విశ్లేషిస్తే సగటున ప్రతి గంటకూ రెండు నుంచి, మూడు ప్రమాదాలు జరుగుతున్నట్లు తేలింది. వాటిలో ఒకటి ద్విచక్ర వాహన ప్రమాదం. 2025లో నవంబరు 30 వరకూ రాష్ట్రంలో 18,837 ప్రమాదాలు జరగ్గా 8,466 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో దాదాపు 45 శాతానికి పైగా ప్రమాదాలు, ప్రమాద మరణాలు ద్విచక్ర వాహనాలతో చోటు చేసుకున్నవే. ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు కనీసం ఒక్క మరణమైనా చోటు చేసుకునే ముప్పు అధికంగా ఉంటోంది.




**9 ముప్పులు**

- ప్రమాదకరంగా ఓవర్‌టేకింగ్ చేయటం
- నిర్లక్ష్యంగా డ్రైవింగ్
- వాహన నిర్వహణ సరిగ్గా లేకపోవడం
- ఎక్కువ దూరం బైక్‌పై ప్రయాణించటం వల్ల అలసిపోవటం
- మంచు కమ్మేసిన సందర్భాల్లో ముందున్న వాహనాలు సరిగ్గా కనిపించకపోవటం
- రాత్రి వేళల్లో రహదారులు సరిగ్గా కనిపించకపోవటం
- జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనం నడిపేటప్పుడు లేన్ డిసిప్లేన్ పాటించకపోవటం
- వ్యతిరేక దిశలో వాహనాలు నడపటం
- నైపుణ్యం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపటం

**అలా చేస్తే 11,139 మంది సేఫ్!**

2020 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో జరిగిన ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో 16,141 మంది మృతి చెందారు. అందులో 11,139 మంది (69.01 శాతం) ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించలేదు. తలకు బలమైన గాయాలవడం వల్లే వారు ప్రాణాలు కోల్పోయారు. శిరస్త్రాణం ధరించుంటే ఆ ప్రాణాలన్నీ దక్కేవి. 11,139 మందిలో 7,765 మంది బైక్ నడిపే వారు కాగా, 3,374 మంది వెనక సీట్లో కూర్చొన్న వారు. బైక్ నడిపేవారికే కాదు, వెనక కూర్చొన్న వారు కూడా హెల్మెట్ ధరించటం ఎంత కీలకమో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రమాదానికి గురై బైక్ మీద నుంచి కింద పడిపోయినప్పుడు తల రోడ్డు పక్కన ఉన్న డివైడర్ లేదా పేవ్‌మెంట్‌ను ఢీకొడితే ప్రాణాపాయం ఎక్కువ. ఇలాంటి సందర్భాల్లో హెల్మెట్ రక్షణ కీలకం. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు తలకు గాయాలవ్వటం వల్లే సంభవిస్తున్నాయనేది పోలీసులు, రవాణా శాఖాధికారుల మాట. తలపై ఓ మోస్తరు దెబ్బ తగిలినా లోపలి భాగంలో రక్తస్రావమయ్యే ప్రమాదముంది. ఇది ప్రాణాంతకమవుతోంది. ప్రాణాలతో బయటపడ్డా కొన్ని సందర్భాల్లో నెలల తరబడి కోమాలోనే ఉండాల్సి వస్తోంది. 2025లో విజయవాడ కమిషనరేట్ పరిధిలో గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 366 మంది మృతి చెందగా అందులో 209 మంది ద్విచక్ర వాహన ప్రయాణికులే. వీరిలో ఎక్కువ మంది ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించలేదు. ప్రాణనష్టం అధికంగా ఉండటానికి ఇదే కారణమైంది.

# ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించిన అరకు ఉత్సవ్

**పర్యాటకుల్లో జోష్**

**నాలుగు రోజుల పాటు ఆంధ్రా ఊటీ అరకులోయలో నిర్వహించిన అరకు ఉత్సవ్**

**వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు**

**ప్రపంచవ్యాప్తంగా అధిక డిమాండ్ ఉన్న చిరుధాన్యాలకు పెద్దపీట**

ప్రకృతి రమణీయ దృశ్యాలను చూడటమే కాదు. దాని వెనుక ఉన్న గిరిజనుల జీవన విధానాలను కనులారా వీక్షించడమూ ఓ కొత్త అనుభూతి. 4 రోజుల పాటు ఆంధ్రా ఊటీ అరకులోయలో నిర్వహించిన అరకు ఉత్సవ్ అటువంటి అనుభూతినే మిగిల్చింది. పర్యాటకాభివృద్ధికి అరకు ఉత్సవ్ ఓ దిక్సూచి. వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. వారందరూ అరకు ఉత్సవ్‌తో మరింత జోష్‌లో మునిగిపోయారు.

## అలరించిన కళాకారులు :

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నివాల్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 700 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో పర్యాటకులను అలరించారు. కార్నివాల్ అందరి మనసులను చూరగొంది. హెలీరైడ్, హాట్ ఎయిర్ బెలూన్, పారా మోటరింగ్ వంటి ఎడ్వెంచర్ కార్యక్రమాలు ప్రతీ ఒక్కరికీ కొత్త అనుభూతిని కలిగించాయి. పుష్ప సోయగాలను పెంచేలా పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన పర్యాటకుల మనసును హత్తుకుంది. అరకు ఉత్సవ్‌కు పర్యాటకులు, స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గతేడాది కంటే ఎక్కువ మంది వచ్చారు. వీరికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అరకు ఉత్సవ్ ఆహూతులను ఉర్రూతలూగించింది. ఉత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులకు మధురమైన అనుభూతిని మిగిల్చింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారుల నృత్యాలు, గాయకుల పాటలకు జనం నుంచి వచ్చిన స్పందనతో ఉత్సవ ప్రాంగణం దద్దరిల్లింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా భారీగా హాజరైన జనంతో అరకు లోయలో పండగ వాతావరణం నెలకొంది. అరకు ఉత్సవ్ – 2026 కార్నివాల్‌తో ఉత్సవ ప్రాంగణం అంతా సందడి వాతావరణం నెలకొంది. గిరిజన సంప్రదాయ నృత్యం థింసా, తప్పెటగుళ్లు, పులి వేషాలు, వివిధ రూపాల అలంకరణతో ప్రదర్శనలు, భరత నాట్యం, చెక్క భజన, కొమ్ము బూరల నృత్యం, తీన్‌మార్, బిందెల నృత్యంతో పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. ఉత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్కూబా డైవింగ్, జిప్ లైనర్, చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన వంటకాలు, కారవాన్ వాహనాలు, స్టారీ స్కై రూమ్స్ స్టాళ్లు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. వాటిని ఎంతో ఆసక్తిగా తిలకించారు. పర్యాటకుల సౌకర్యార్థం చొంపి గ్రామంలో హోంస్టేలు ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలతో అరకు తాలీ : ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలకు అధిక డిమాండ్ ఉంది. వీటితో ప్రత్యేకంగా వంటకాలను తయారు చేశారు. వీటిని పర్యాటకులకు రుచి చూపించే బృహత్తర కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ శ్రీకారం చుట్టారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల వంటకాల తాలీని ఏర్పాటు చేశారు. దీనికి 'అరకు కౌనీ'గా పేరు పెట్టారు. దీన్ని స్థానికంగా లభించే కొర్రలు, జొన్నలు, గంట్లు, సామలు తదితరాలతో తయారు చేశారు. వీటిని అరకు ప్రాంతంలోని అన్ని హోటళ్లలో అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యంతో పాటు గిరిజన వంటలకు డిమాండ్ పెరగనుంది. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. చిరుధాన్యాలతో పరమాన్నం, పులిహోరలను కూడా తయారు చేశారు.




## కళ్లకు కట్టేలా నృత్యాలు :

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఉత్సవాలకు సుమారు 10 రాష్ట్రాలోని గిరిజన కళాకారులు విచ్చేయడం గమనార్హం. వివిధ రాష్ట్రాల్లోని ఆదివాసీల జీవన విధానాలు, వారి ఆచార, సంప్రదాయాలను కళ్లకు కట్టేలా నృత్యాలు ప్రదర్శించారు. మన్యంలో గిరిజనులు ప్రతి భావోద్వేగాన్ని సంప్రదాయ నృత్యమైన థింసా ఆడుతూ ప్రదర్శిస్తారు. వారిని ఇతర రాష్ట్రాల సంప్రదాయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ విస్తరణ
# ప్రతి పల్లెకూ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

**స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన సామగ్రి వినియోగం**

**ఏపీ టెలికాం సర్కిల్ అంతటికీ విస్తరణ**

**నేటికీ 2జీ నెట్‌వర్క్‌ను కొసాగిస్తున్న బీఎస్ఎన్ఎల్**

**5జీ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చేలా ప్రణాళిక**




డిజిటల్ యుగంలోనూ పల్లెల్లో నేటికీ ఇంటర్నెట్ సేవల అంతరాయం ప్రధాన సమస్యగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకపై బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలనూ ప్రతి పల్లెకూ విస్తరిస్తోంది. బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) ప్రైవేటుతో పోటీకి సన్నద్ధం అవుతుంది. దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు అందుబాటులో ఉన్న 3జీ సేవలను నిలిపేసింది. ప్రస్తుతం 4జీ సేవలను పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యంత్ర పరికరాలను వినియోగించడం గమనార్హం. బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ విస్తరణను పెంచనుంది. దీనిలో భాగంగా సెల్ టవర్లను పెంచడం, వినియోగదారులను ఆకర్షించే పనిలో ఉంది. 2015 తరువాత ప్రైవేట్ ఆపరేటర్లు విదేశాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం దిగుమతి చేసుకొన్న యంత్ర పరికరాలను మాత్రమే వినియోగించారు. తద్వారా 4జీ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చారు. దాదాపు 16 వేల చోట్ల 4జీ నెట్‌వర్క్ : బీఎస్ఎన్ఎల్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన వాటినే వినియోగించాలన్న ఉద్దేశంతో 2019లో ప్రయోగాలు మొదలు పెట్టింది. స్వదేశీ పరిజ్ఞానంతో బీటీఎస్, మిమో యాంటెన్నాలను 2 ఏళ్ల పాటు శ్రమించి రూపొందించారు. అదేవిధంగా 2021లో ప్రయోగాత్మకంగా పంజాబ్‌లో సేవలు ప్రారంభించారు. ఏపీ టెలికాం సర్కిల్ పరిధిలో 2023 జూన్ నుంచి మొదలుపెట్టి గతేడాది మార్చి నాటికి పరికరాలు అమర్చారు. ఏడాది చివరికల్లా సాంకేతిక సమస్యలు దాదాపు అధిగమించారు. ఏపీ టెలికాం సర్కిల్ పరిధిలో సుమరుగా 16 వేల చోట్ల 4జీ నెట్‌వర్క్‌కు బీటీఎస్ (బేస్ ట్రాన్సివర్ సిస్టం)లు అమర్చారు.

**5జీ సేవలకై ప్రణాళిక రూపకల్పన :** ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ కీప్యాడ్ ఫోన్లు పని చేసేందుకు ఉపయోగించే 2జీ నెట్‌వర్క్‌ను కొనసాగిస్తోంది. ఇంటర్నెట్ అవసరాలు పెరగడంతో మారుమూల పల్లెల్లోనూ 4జీ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చింది. తర్వాత దశలో 5జీ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చేలా ప్రణాళిక రూపొందించింది. 4జీ సేవలు అందించడంలో భాగంగా ఒక సెల్‌టవర్ పరిధిలో 3 బ్యాండ్లలో రేడియో తరంగాలను విడుదల చేస్తారు. దీనిలో 700 మెగా హెర్ట్జ్ (మీఎ) బ్యాండ్‌లో తక్కువ సిగ్నల్స్‌తోనే దాదాపు మూడున్నర కిలోమీటరు దూరం కవరేజీ ఉంటుంది. 2100 ఎంహెచ్‌లో కాస్త తక్కువ దూరం కవరేజీతో సిగ్నల్స్ ఎక్కువగా ఉంటాయి.

**మరో 1000 టవర్లను అమర్చేలా :** పట్టణాలు, రద్దీగా ఉండే నగరాల్లో కిలోమీటరు పరిధిలో ఎక్కువ సిగ్నల్స్ ఉండే 2,500 ఎంహెచ్ బ్యాండ్ వినియోగిస్తారు. ఇప్పుడు 3జీ, 4జీ నెట్‌వర్క్‌లో 2,100 ఎంహెచ్ బ్యాండ్ రెండింటికి వినియోగించడంతో సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో 3జీ సేవలను పూర్తిగా నిలిపివేశారు. సెల్‌టవర్ల విస్తరణ లేకపోవడం వల్ల కవరేజీ సమస్య ఎదురవుతోంది. దీంతో రాష్ట్రంలో మరో 1000 టవర్లను అమర్చేలా ప్రణాళిక రూపొందించారు.

**రానున్న రోజుల్లో మరింత పెరగనున్నారు :** ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు వినియోగదారులు మళ్లుతున్నారని, రానున్న రోజుల్లో మరింత పెరగనున్నారని బీఎస్ఎన్ఎల్ ఒంగోలు డివిజనల్ మేనేజర్ వీరాంజనేయులు పేర్కొన్నారు. ప్రైవేటు ఆపరేటర్ల మాదిరిగానే తామూ రోజుకు 2 జీబీ డేటా, ఉచిత కాల్స్‌తో కూడిన సిమ్ కనెక్షన్ రూపాయికే అందించడం వంటివి చేస్తున్నామని ఆయన వివరించారు.

# ఈసారి నుంచి ఇంటర్ విద్యార్థులకు వెల్‌కమ్ కిట్!


**అందులో ఏమేం ఉంటాయంటే?**

**ఏకరూప దుస్తులతో పాటు పలు రకాల పుస్తకాలు**

**తెలంగాణ ప్రభుత్వ ఇంటర్ విద్యాశాఖ ప్రతిపాదన**

**అనుమతిస్తే 1.80 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం**

**సమగ్ర శిక్షా ప్రాజెక్టుకు రూ.42,100 కోట్లు**



తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఈ ఏడాది నుంచి కొత్తగా వెల్‌కమ్ కిట్ అందజేయాలని ఇంటర్ విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసింది. దీంతో విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఈ కిట్‌లో ఏముంటాయంటే? విద్యార్థులకు ఉపయోగ పడేలా వారికి ఏకరూప దుస్తులు, నోట్స్, లెసన్, వర్క్‌బుక్స్ అందజేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే జూన్ 1న తరగతుల ప్రారంభం రోజే వాటిని విద్యార్థులకు అందించేందుకు ఇంటర్ విద్యాశాఖ దీనిపై కసరత్తు ప్రారంభించింది.

**సమగ్ర శిక్షా నిధుల విడుదల :** ఈ వెల్‌కమ్ కిట్‌కు మొత్తం రూ.70 కోట్ల వరకు బడ్జెట్ అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర శిక్షా ఒకటి నుంచి 12వ తరగతి వరకు వర్తిస్తుంది. దీన్ని మొదటగా ప్రస్తుత విద్యా సంవత్సరం 2025–26లో ఉన్న క్రీడా పరికరాలు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, ల్యాబ్‌లు తదితర వాటికి పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్షా నిధులను విడుదల చేసింది. అలాగే ఈసారి అదేవిధంగా వెల్‌కమ్ కిట్‌కు అవసరమైన నిధులు సైతం ఆ పథకం నుంచే కేటాయించాలని ప్రతిపాదించారు. రాష్ట్రవ్యాప్తంగా 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా వాటిలో ప్రస్తుతం చదువుతున్న 1.80 లక్షల మంది ఇంటర్ విద్యార్థులు ఈ కిట్ ద్వారా లబ్ధి పొందనున్నారు. విద్యార్థులకు కిట్స్ అందించాలన్న ప్రతిపాదనకు ఆమోదం లభిస్తుందన్న ఆశాభావంతో అన్ని విధాలుగా సిద్ధమవుతున్నామని తాజాగా విద్యాశాఖ ఉన్నతాధికారి తెలిపారు.

**ఎందుకు ఇవి ఇవ్వాలంటే? :** రాష్ట్రంలోని వివిధ గురుకుల జూనియర్ కళాశాలల్లో చదివే వారికి సర్కారు ఇప్పటికే ఏకరూప దుస్తులను అందజేస్తుంది. కానీ ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులకు మాత్రం ఆ సౌకర్యం లేదు. ప్రభుత్వ సంస్థలో చదివే విద్యార్థుల్లో 90 శాతం మంది అత్యంత పేద కుటుంబాలకు చెందిన వారే ఉంటారు. ఈ పిల్లల చదువుకు సంబంధించి యూనిఫామ్, పలు రకాల పుస్తకాల కొనుగోలు భారం వారి తల్లిదండ్రులపై పడుతోంది. ఈ నేపథ్యంలో వీటన్నింటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని ఇంటర్ విద్యార్థులకు సైతం రెండు జతల యూనిఫామ్‌దుస్తులు, పలు రకాల పుస్తకాలను వెల్‌కమ్‌కిట్ ద్వారా అందజేయాలని ఇంటర్ విద్యాశాఖ తెలిపింది. పాఠ్య పుస్తకాలతో పాటు వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్, రికార్డులను అందించాలని ఇంటర్ విద్యాశాఖ ప్రతిపాదించింది.

**సమగ్ర శిక్షా ప్రాజెక్టు ప్రయోజనాలు :** ప్రస్తుతం ఉన్న సమగ్ర శిక్షా 2.0 మార్చి నెలతో ముగుస్తుంది. ఆ తర్వాత సమగ్ర శిక్షా 3.0ను అమలు చేయాల్సి ఉంది. ఈలోపే కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. అయితే ఇప్పుడిస్తున్న నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని రాష్ట్రాల అధికారులు మొరపెట్టుకున్నా కానీ ఫలితం లేకుండా పోయింది.

**గత ఏడాది కంటే రూ.850 కోట్లు అధికం :** తాజా బడ్జెట్‌లో సమగ్ర శిక్షాకు కేవలం రూ.42,100 కోట్లు మాత్రమే కేటాయించడం విశేషం. గత ఏడాది కంటే రూ.850 కోట్లు మాత్రమే అధికం. అయితే 2025–26 సవరించిన బడ్జెట్‌ను రూ.38 వేల కోట్లుగా చూపారు. కేటాయించిన నిధుల కంటే రూ.3,250 కోట్లు తగ్గించారు. ఇదిలా ఉండగా మరో వైపు పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజన పథకం)కు రూ.12,750 కోట్లు కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.250 కోట్లు మాత్రమే అధికం. పీఎం శ్రీ పథకానికి గత ఏడాది రూ.7,500 కోట్లు కేటాయించినా సవరించిన బడ్జెట్‌లో అది రూ.4,500కు చేరింది. ఈసారి కూడా రూ.7,500 కోట్లు ప్రతిపాదించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com